క్లుప్తంగా

ఆస్ట్రేలియా చిలుక అప్పగింత


చిలుకను యజమానికి అప్పగిస్తున్న రూతమ్మ

గుత్తి: తమకు దొరికిన ఆస్ట్రేలియా చిలుకను యజమానికి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు తల్లీకొడుకులు రూతమ్మ, నాగేంద్ర. వివరాలు.. మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ పల్లి గుడ్ షఫర్డ్ చర్చి పాస్టర్ హరి పెంచుకుంటున్న ఆస్ట్రేలియా చిలుక ఈనెల 2వ తేదీన ఎక్కడికో వెళ్లిపోయింది. చిలుక కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. అయితే ఆ చిలుక చెట్నేపల్లిలో నివాసం ఉంటున్న కౌన్సిలర్ రూతమ్మ, ఈమె కుమారుడు గద్దల నాగేంద్రకు ఈనెల 2వ తేదీన దొరికింది. శనివారం చిలుక ఫోటోలను యజమాని హరి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టారు. దాన్ని గమనించిన రూతమ్మ, నాగేంద్ర వెంటనే చిలుక తమ వద్ద ఉందని హరికి సమాచారం ఇచ్చారు. వెంటనే హరి చెట్నేపల్లికి వెళ్లి చిలుకను స్వాధీనం చేసుకున్నాడు.

నాడు-నేడు పనులు పూర్తి చేయించండి


భగత్‌సింగ్ స్కూల్ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వివిధ స్కూళ్లల్లో నాడు-నేడు కింద జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయించాలని ఇంజనీర్లకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. శనివారం భగత్‌సింగ్ మున్సిపల్ స్కూల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అలాగే వైఎస్సార్ అర్బన్ హెల్త్‌క్లినిక్‌ను తనిఖీ చేశారు. తిలక్‌నగర్‌లో డ్రైనేజీలోకి సెప్టిక్ వేస్ట్‌ను వదులుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, పైప్‌ను బ్లాక్ చేయించారు. అంతకుముందు హనుమేష్ నగర్‌లో డ్రైనేజీ నిండి రోడ్డుపై మురుగునీరు పారుతుందని ఫిర్యాదు అందడంతో క్లియర్ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆంజనేయులు, టీపీఎస్ అబ్దుల్ సత్తార్, డీఈ హేమచంద్ర, ఏఈ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుని పరిష్కరిద్దాం


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ రామిరెడ్డి

పెద్దపప్పూరు: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఇన్‌చార్జి ఎంపీపీ వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో 99 శాతం హామీలను నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి లబ్ధి చేకూరని వారిని గుర్తించి వారికి సంక్షే పథకాలు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు పప్పక కళావతి, ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓఆర్డీ కమలాబాయి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెన్నాకు నీటి విడుదల

పెద్దపప్పూరు: చాగల్లు రిజర్వాయర్ నుంచి దిగువ పెన్నాకు శనివారం 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు హెచ్చెల్సీ జేఈ హరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లకూడదని సూచించారు. ఇప్పటికే వలంటీర్ల ద్వారా హెచ్చరికలు జారీ చేయించారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో నీరు ఎక్కువగా ఉండటంతో ముందు జాగ్రత్తగా నీటిని విడుదల చేశామన్నారు.

12 నుంచి ఉరుసు ప్రారంభం


ఉరుసు పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: హజరత్ సయ్యద్‌షా అలీ అక్బర్ ఉరుఫ్ హజరత్ మస్తాన్‌వలి దర్గా 388వ ఉరుసు ఈనెల 12 నుంచి ప్రారంభం అవుతుందని దర్గా ఈఓ సమీమ్ తెలిపారు. శనివారం దర్గా ఆవరణలో ఉరుసుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ, ముస్లిం సోదరుల మత సామరస్యానికి ప్రతీకగా ఉరుసును ఏటా ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందులో భాగంగానే 12వ తేదీ శనివారం రాత్రి స్వామి గంధం ఊరేగింపు, 13వ తేదీ ఆదివారం రాత్రి షంషీర్ (ఉరుసు) జరుగుతుందన్నారు. 14న సోమవారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు గణాచారి బాబురెడ్డి, జీపీ తిమ్మారెడ్డి, మంతకల్లురెడ్డి, దర్గా అభివృద్ధి, సేవా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.సుంకన్న, పాండురంగ, కోశాధికారి మహలింగ, నాయకులు జింకల ధనుంజయ, టి.లక్ష్మన్న, అల్తాఫ్‌హుసేన్, సలీమ్‌బాషా, ప్రభాకర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి


నడిమిదొడ్డిలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నార్పల: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే పద్మావతి నడిమిదొడ్డికి గ్రామానికి చేరుకోగానే గ్రామస్తులు డప్పువాయిద్యాలతో బాణాసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం అదే గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మీ ఇంటి వద్దకే వచ్చాం. మీ సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని సూచించారు. మహిళలు ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ వెంటే నడిచారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి, సంక్షేమాలను సమానంగా చూస్తూ ప్రజలకు న్యాయం చేసే ప్రభుత్వం ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. దేశంలో ఎక్కడా కూడా పేద ప్రజలకు ఇన్ని సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవని స్పష్టం చేశారు. పేదల కష్టాలు తెలుసుకున్న జగనన్న.. వారి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేశారని పేర్కొన్నారు. జగనన్న చేస్తున్న మేలు పచ్చ పార్టీ నాయకులు, దత్తపుత్రుడికి కనబడటం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, కో-ఆప్షన్ సభ్యురాలు షాబీరా, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, వైస్ ఎంపీపీ మల్లేశ్వరయ్య, నాయకులు మునిరెడ్డి, లక్ష్మిరెడ్డి, నల్లప్ప, నాగభూషణ, నాగార్జున, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

నార్పల: మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరామని టీడీపీ నాయకులు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో నాగేంద్ర, ఎర్నాగప్ప, నాగయ్య, నాగరత్నమ్మ, బాలలింగం, కృష్ణయ్య, రామాంజినేయులు, రామాంజి, నాగముని, పుల్లయ్య, నాగార్జున తదితరులు ఉన్నారు.

టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ అందజేత

బుక్కరాయసముద్రం: స్థానిక భవిత కేంద్రంలో ఉన్న దివ్యాంగ పిల్లలకు నేచురల్ నాలెడ్జి కేరింగ్ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ లింగా నాయక్ మాట్లాడుతూ.. సమాజంలో దివ్యాంగ పిల్లలకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలన్నారు. దివ్యాంగ పిల్లలను ప్రతి మంగళవారం నిర్వహించే ఫిజియో థెరపీ క్యాంపునకు తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాధ, ఐఈఆర్పీ ఆదినారాయణ, లక్ష్మీ నారాయణ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సీతారాం, రాజశేఖర్, కిషోర్, రాజేశ్వరి, శ్రీదేవి, భార్గవి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు ఎస్‌ఐగా దిలీప్ కుమార్



పుట్లూరు: పుట్లూరు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా దిలీప్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండలంలోని పరిస్థితులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పుంగనూరు విధ్వంసానికి చంద్రబాబే కారకుడు


అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న నైరుతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

గుంతకల్లుటౌన్: పుంగనూరులో జరిగిన విధ్వంసానికి చంద్రబాబే కారణమని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప అన్నారు. పుంగనూరులో విధ్వంసానికి పాల్పడిన టీడీపీ నాయకుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ అరాచకాలకు పాల్పడుతున్న చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని అంబేద్కర్‌ను వేడుకున్నారు. అనంతరం నైరుతిరెడ్డి, సుంకప్ప మాట్లాడుతూ.. పుంగనూరులో హింసను ప్రోత్సహించి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు రెచ్చగొట్టడంతోనే టీడీపీ కార్యకర్తలు పోలీసులపై విచక్షణా రహితంగా దాడులకు పాల్పడ్డారన్నారు. ఓడిపోతాననే భయంతోనే నీచానికి దిగారని మండిపడ్డారు. విధ్వంసానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీ ఆర్ మోహన్, కౌన్సిలర్లు కెవి.నాగరత్న, మెహరున్నీసా, చాంద్‌బాషా, సుమోబాషా, రవీంద్ర, లింగన్న, భాస్కర్ కోఆప్షన్‌సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, సచివాలయాల పట్టణ కన్వీనర్ ఖలీల్, వార్డు ఇన్‌ఛార్జ్‌లు మార్కెట్‌వెంకటేష్, వీరేష్, హరినాథ్‌రెడ్డి, సంపత్, మస్తాన్, సి.హరి, పరుశురాముడు, ఎస్సీ సెల్ కన్వీనర్ ప్రతాప్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

10 నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


గార్లదిన్నె: నులిపురుగుల నివారణ మందులు అందజేస్తున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు


శింగనమల: పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, వైద్యులు

శింగనమల: ఈనెల 10వ తేదీన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫిర్దోస్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎంఈఓ నరసింహరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది విడుదల చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వాడితే నులిపురుగులు చనిపోతాయన్నారు. నులిపురుగుల వలన రక్తహీనత, పోషకాలోపం, కడుపు నొప్పి, నీరసం, వాంతులు, విరేచనాలు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ నీలోఫర్‌కుమారి, ఎంపీహెచ్ఓ వెంకటరమణ, సూపర్‌వైజర్లు సుధాకర్, అశ్వర్థనారాయణ నాగమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ఈనెల 10న జరగనున్న జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ.. 1-19 సంవత్సరాల్లోపు వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండోజ్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పిల్లలందరూ తప్పకుండా ఆల్బెండోజ్ మాత్రలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎల్లా రాముడు, సందీప్ యాదవ్, దివ్య, బిందు,ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, పాల్గొన్నారు.

గార్లదిన్నె: ఈనెల 10 నుంచి విద్యార్థులకు నులిపు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న, పీహెచ్‌సీ డాక్టర్ షమీన్‌తాజ్, దిలీప్‌కుమార్, పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకోకుంటే పట్టాలు రద్దు చేస్తాం


మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ విజయ భాస్కర్

బుక్కరాయసముద్రం: జగనన్న హౌసింగ్ కాలనీల్లో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోకుంటే ఇంటి పట్టాలను రద్దు చేస్తామని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయ భాస్కర్, హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ, ఐకేపీ ఏపీఎం మద్దిలేటితో కలసి తహసీల్దార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద 32 కాలనీల్లో ఇళ్లు లేని 3,233 మంది నిరు పేదలకు ఇంటి పట్టాలను మంజూరు చేశామన్నారు. అయితే వీటిలో 1,387 మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారన్నారు. 51 పునాది, 600 బేస్ మట్టం, 154 తీరు మట్టం దశల్లో ఉన్నాయని తెలిపారు. 582 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు వెల్లడించారు. ఇంకా 1,846 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించ లేదన్నారు. ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం సంఘాల ద్వారా రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. వారం రోజుల్లోపు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టక పోతే ఇంటి పట్టాలను చట్టపరంగా రద్దు చేసి వేరే లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద పొలం పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ అలెగ్జాండర్, ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి

యాడికి: మండలంలోని నిట్టూరు గ్రామంలో రైతు రాజేశ్వర రెడ్డి దళితులకు చెందిన పొలాన్ని ఆక్రమించుకున్నట్లు బాధితులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం తహసీల్దార్ అలెగ్జాండర్, ఎస్ఐ గుర ప్రసాద్ రెడ్డి వివాదాస్పదంగా ఉన్న పొలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాజేశ్వర రెడ్డి తమ భూముల్లో రెండు బోరుబావులు తవ్వుకుని సమీపంలోని వ్యవసాయ పొలానికి నీరు తీసుకెళ్తున్నట్లు దళితులు తెలిపారు. సదరు పొలంలోకి తమను రానీయకుండా అడ్డుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 536లో 2 ఎకరాల భూమి ఓబుళమ్మ పేరుతో ఉందని తెలిపారు. ఈ విషయంలో రాజేశ్వర రెడ్డికి ఓబుళమ్మ మనవడైన చిన్న ఆంజనేయులుకు గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం తహసీల్దార్ అలెగ్జాండర్, ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి సంయుక్తంగా వెళ్లి ఓబుళమ్మ పేరిట ఉన్న రికార్డులు పరిశీలించారు. నివేదికను ఆర్డీఓకు పంపనున్నట్లు తెలిపారు.

తాగిన మైకంలో కొట్టానికి నిప్పు

● రూ.2 లక్షల ఆస్తి నష్టం

పామిడి: మండలంలోని కండ్లపల్లి దళితవాడలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక బజారక్క అనే మహిళకు చెందిన కొట్టం అగ్నికి ఆహుతైంది. వివరాలు.. ఇటీవలే బజారక్క డ్వాక్రా మహిళా సంఘం నుంచి రూ.లక్ష వడ్డీకి తీసుకుంది. ఆ డబ్బుతో బ్యాంకులో తాకట్టు పెట్టిన నగలు విడిపించుకుంది. ఇది ఓర్చుకోలేని భర్త నల్లప్ప భార్యతో గొడవ పడ్డాడు. గత మూడురోజులుగా భార్యాభర్తల మధ్య వాగ్వాదం నడుస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక కోపోద్రిక్తుడైన భర్త నల్లప్ప తాగిన మైకంలో కొట్టానికి నిప్పు పెట్టి పరారయ్యాడు. ఇంట్లో నైటీలు, దుస్తులు, నగలు, నిత్యావసర సరుకులు, మిషన్ సామగ్రి ఆహుతయ్యాయి. రూ.2 లక్షల దాకా ఆస్తినష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపింది. పామిడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

9న టెంకాయల విక్రయ హక్కులకు వేలం

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వర్థ నారాయణ స్వామి క్షేత్రంలో ఈనెల 9వ తేదీన టెంకాయల విక్రయ హక్కుల కోసం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మాఘమాసం మినహా విడిదినాల్లో టెంకాయల విక్రయ హక్కులు పొందుటకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం పాల్గొనే వారు ముందుగా రూ.50 వేలు చెల్లించాలన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


మాట్లాడుతున్న హెడ్ కానిస్టేబుల్ నీలకంఠారెడ్డి

గుత్తి రూరల్: బాల్య వివాహాలతో అనర్థాలు సంభవించి తల్లీబిడ్డ ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారిణి వెంకటేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని రజాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఉషారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ నీలకంఠారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల్య వివాహాలు లేదా మీ స్నేహితురాళ్లకు వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే చైల్డ్‌లైన్ 1098కు సమాచారం అందించాలన్నారు. బాలికల్లో వస్తున్న మార్పులను తల్లిదండ్రులు రోజు గమనిస్తూ ఉండాలన్నారు. బాలికలు ఏ విధమైన సమస్యలు ఎదుర్కొంటున్నా 1098 లేదా 100 కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం బాలికలకు పోక్సో యాక్టు, బాలల హక్కులు, చట్టపరమైన శిక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి ధనలక్ష్మి, వైస్ ప్రిన్స్‌పాల్ రమాదేవి, కానిస్టేబుల్ నాగరాజు, గురుకుల ఉపాధ్యాయురాళ్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీనియర్ అసిస్టెంట్

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా దాదా ఖలందర్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఎంపీపీ గంగాదేవి, ఎంపీడీఓ వీరాజు ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ శంకర్‌కు ఏఓగా పదోన్నతి లభించింది. శంకర్‌ను కుందుర్పి మండలానికి బదిలీ చేశారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

పామిడి: మండలంలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతోంది. ఏపీటీఎఫ్ నాయకులు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులతో సభ్యత్వం చేయిస్తున్నారు. అనంతరం రీ అపోర్షన్, ప్రమోషన్ మీద ఇటీవల బదిలీపై వచ్చిన టీచర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలంటూ సీఎస్‌డీటీ శ్రీరాములుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బీవీ రమణ, సతీష్, మల్లికార్జున, ఉజ్జినప్ప, జాకీర్, నూర్‌మహమ్మద్, రామాంజనేయులు, జిలాన్, చంద్ర, సింహద్రప్ప, సుంకన్న, సిమ్మన్న, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దవడుగూరు: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మండల శాఖ నాయకులు శ్యామ్‌రవిబాబు, రమేష్, దాదాఖలందర్, వివేకానంద, మధుకిషోర్, అరుణ, నాగరాజు, సింహాచలం కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు జీతాలను పెంచాలన్నారు. ప్రమోషన్లు త్వరగా ఇవ్వాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని ఆర్ఐ శ్రీనివాసులుకు అందజేశారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

తాడిపత్రి అర్బన్: పుట్టిన 45 రోజులకే కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారికి ఫయాజ్ బాషా ట్రస్టు చైర్మన్ హీరాపురం ఫయాజ్‌బాషా అండగా నిలిచారు. స్థానిక కార్యాలయంలో రాజేంద్ర ప్రతాప్, పద్మిని దంపతులకు చెందిన చిన్నారి వైద్య ఖర్చులకు శనివారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చవ్వా రాజశేఖర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, వైస్ చైర్మన్ మహబుబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని వినియోగించుకోండి


గుత్తిలో లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

యాల్లనూరు: ప్రభుత్వం గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత రాకుండా ప్రభుత్వం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పంపిణీ చేస్తోందని తహసీల్దార్ సుమతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు లోకేష్, ఏఎన్ఎం శ్రీదేవి, అంగన్‌వాడీ వర్కర్లు శివకామిని, సరిత, బీబీ, కుళ్లాయమ్మ, మహిళా పోలీస్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ర్యాలీ..

గుత్తి: గుత్తి సెక్టార్ పరిధిలోని మొత్తం 44 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీలు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ డిల్లీశ్వరి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్వాడీ టీచర్లు నాగలక్ష్మి, పార్వతి, మహాలక్ష్మి, సరళ, కౌన్సిలర్లు వరదరాజులు, నరేష్, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ, సీఐకి సన్మానం


డీఎస్పీ గంగయ్యను సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు

తాడిపత్రి అర్బన్: ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల జేఏసీ నాయకులు శనివారం డీఎస్పీ సీఎం గంగయ్య, అర్బన్ సీఐ హమీద్‌ఖాన్‌ను సత్కరించారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సీఎం గంగయ్యను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ హమీద్‌ఖాన్‌ను పూలమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ రవిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య, శ్రీనాథ్, బాలకంబగిరి, రాజు, గోపాల్ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ జాతర

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రామాలయం వీధిలో వెలిసిన ముత్యాలమ్మ దేవాలయంలో ఆదివారం జాతర నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మ కర్త గంగాధర్, సభ్యులు హేమావతి, ఉదయగిరి సుబ్బరాయుడు, బాలసుబ్రమణ్యం నాయుడు, కుమార్ శనివారం తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి జాతర ప్రారంభం అవుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి జాతరలో పాల్గొనాలని కోరారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్చండి

యల్లనూరు: బడి బయట పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్చాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజామణి, ప్రధానోపాధ్యాయులు, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యూజీ పరీక్షల్లో నలుగురి డిబార్

అనంతపురం: ఎస్కేయూ యూజీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం సంచాలకులు ఆచార్య జీవీ రమణ తెలిపారు. శనివారం పామిడి, గుత్తి, గుంతకల్లు, అనంతపురం పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. గుత్తిలో శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఐదో సెమిస్టర్ పరీక్షల్లో చూసి రాస్తున్న ఇద్దరని, గుంతకల్లులో శ్రీ వెంకటేశ్వర కళాశాల రెండో సెమిస్టర్‌లో చూసి రాస్తున్న ఒకరిని బుక్ చేసినట్లు వివరించారు. అనంతపురం ఎస్ఎల్ఎన్ కళాశాలలో ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు తెలిపారు.

తాగునీటి సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో శనివారం గుత్తి మున్సిపాలిటీలో నెలకొన్న తాగునీటి సమస్యపై అఖిల పక్షం నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. వెంటనే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7వ తేదీన చేపట్టిన చలో తిరుపతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, విద్యుత్ కార్మికుల సంఘం నాయకులు ఎస్‌కెఎం.బాషా, తిమ్మప్ప పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్, తదితర డిమాండ్లను సాధించే వరకూ పోరాడుతామన్నారు.